## ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరగాలి

**ఎన్నికల శిక్షణ కార్యక్రమంలో ఎస్పీ వినీత్ గంగన్న**



మాట్లాడుతున్న ఎస్పీ వినీత్ గంగన్న

కొత్తగూడెం క్రైం, నవంబర్ 26: వచ్చే నెల 5న జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలని ఎస్పీ డాక్టర్ వినీత్ గంగన్న అన్నారు. జిల్లాకేంద్రంలోని రామవరం మెట్టు ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. తొలుత నవంబర్ 26/11 పోలీస్ అమరవీరులకు నివాళులర్పించారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా రాజ్యాంగ విలువలను ప్రస్తావించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. పోలింగ్ విధుల విషయంలో అధికారులు, సిబ్బంది అత్యంత బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎన్నికల నియమాల ప్రకారం ప్రతి ఓటరు ఓటు హక్కు వినియోగించుకునేందుకు సహకరించాలన్నారు. తమకు కేటాయించిన విధులను ప్రతిఒక్కరూ సక్రమంగా నిర్వర్తించాలని, నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తప్పవన్నారు. పోలింగ్ రోజున శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులను ఉపేక్షించొద్దన్నారు. ఎవరైనా ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే, వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ (ఆపరేషన్స్) టి.సాయిమనోహర్, ఏఆర్ అదనపు ఎస్పీ విజయ్ బాబు, డీఎస్పీలు షేక్ అబ్దుల్ రెహమాన్, రాఘవేంద్రరావు, కేవీ రమణ మూర్తి పాల్గొన్నారు.

## కృత్తికా దీపోత్సవానికి అంకురారోపణ



తీర్థపు బిందె తీసుకువస్తున్న అర్చకుడు

భద్రాచలం, నవంబర్ 26: భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని సోమవారం అర్చకులు కృత్తికా దీపోత్సవం నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా ఆదివారం సాయంత్రం ఉత్సవానికి అంకురారోపణ చేశారు. గోదావరి నుంచి వెండి తీర్థపు బిందెలో గోదావరి జలాలను తీసుకొచ్చారు. యాగశాల నుంచి వేద మంత్రోచ్ఛారణ, మంగళవాద్యాల నడుమ దేవస్థాన ఈవో ఎల్ రమాదేవి, ఆలయ అధికారులు, అర్చకులు, వేద పండితులు ఆలయ ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలోని మూలవరుల వద్ద భగవత్ ప్రార్థన చేశారు. సోమవారం ఉదయం స్వామివారికి 25 వెండి కలశాలతో అర్చకులు ఆవాహన చేస్తారు. స్వామివారి ఉత్సవ మూర్తులకు పంచ ఉపనిషత్తుల ఘోష నడుమ స్వామివారికి అభిషేకం చేస్తారు. సాయంత్రం చొక్కాసుర దహనం చేపడతారు.

## ఎంపీ నామా మానవత్వం



ఘటనా స్థలంలో ఎంపీ నామా నాగేశ్వరరావు

వైరా టౌన్, నవంబర్ 26: వైరా పాత సెంటర్‌లో ఆదివారం ద్విచక్ర వాహనం వేగంగా వెళ్తూ అదుపు తప్పి కిందపడింది. ఘటనలో వాహనదారుడు గాయాలపాలయ్యాడు. ఇదే సమయంలో అటుగా కాన్వాయ్‌లో వెళ్తూ ఎంపీ నామా వాహనాన్ని ఆపారు. క్షతగాత్రుడిని తన సొంత వాహనంలోకి ఎక్కించి ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఎంపీ సిబ్బంది దగ్గరుండి క్షతగాత్రుడికి చికిత్స అందేలా చర్యలు తీసుకున్నారు. బాధితుని కొణిజర్ల మండలానికి చెందిన పొన్నం అప్పారావుగా గుర్తించారు. ఎంపీ స్పందించిన తీరును పలువురు ప్రశంసించారు.

## 13 కిలోల గంజాయి స్వాధీనం

మామిళ్లగూడెం, నవంబర్ 26: ఖమ్మం నగరంలోని రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం ఎక్సైజ్‌శాఖ అధికారులు 13 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ జనార్ధన్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) జి.గణేష్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ సూపరింటెండెంట్ కె.తిరుపతి సూచనలతో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సర్వేశ్వర్ ఆధ్వర్యంలో సిబ్బంది రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం నంబర్– 2ను తనిఖీ చేశారు. ప్రహరీ గోడ మధ్య ఓ బస్తాలో 13 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.3.40 లక్షలు ఉంటుందన్నారు. దాడుల్లో ఎస్సైలు షేక్ ముషీర్ అహ్మద్, ఎన్.అనిల్, హెడ్ కానిస్టేబుల్ కరీం, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

# ఎన్నికల్లో విజయం నాదే !

- **ప్రత్యర్థుల ఆర్భాటాలు నా గెలుపును ఆపలేవు**
- **'నమస్తే'తో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డి**



ఖమ్మం, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): తన హయాంలోనే పాలేరు నియోజకవర్గ అభివృద్ధి జరిగిందని, ఆ అభివృద్ధే ఎన్నికల్లో గెలిపిస్తుందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం, తన విజయావకాశాలపై 'నమస్తే'తో ప్రత్యేకంగా ముచ్చటించారు. నియోజకవర్గ సమస్యలపై స్థానికుడిగా తనకు పూర్తి అవగాహన ఉందని, లభించిన ప్రతి అవకాశాన్ని శాసనసభ్యుడిగా సద్వినియోగం చేసుకుని ప్రజలకు మంచి చేశానన్నారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు ఎదురులేదని, ఎన్నికల్లో గెలుపు తనదేనన్నారు. కొందరు ప్రజల్లో గందరగోళం సృష్టిస్తూ గప్పాలు కొడుతున్నారని మండిపడ్డారు. పాలేరు బిడ్డగా ప్రజలకు సేవ చేస్తూనే ఉంటానని, కష్టం వస్తే ప్రజలు నేరుగా తన వద్దకు వస్తారన్నారు. ఐదేళ్లలో ఎవరికి ఏ కష్టం వచ్చినా స్పందించానని, అందరి సమస్యలు పరిష్కరించానన్నారు. ఎవరు నా నంబర్‌కు కాల్ చేసినా స్పందించే మనస్తత్వం తనదన్నారు. ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకున్నానని, ఇక ముందు కూడా ఇలాగే ఉంటానన్నారు. ప్రత్యర్థుల ప్రచార ఆర్భాటాలు తన విజయాన్ని అడ్డుకోలేవని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గానికి జేఎన్టీయూ, నర్సింగ్ కళాశాలలను తీసుకొచ్చానన్నారు. మళ్లీ ఎన్నికల్లో గెలిచాక నియోజకవర్గానికి వ్యవసాయ అనుబంధ పరిశ్రమ తెచ్చేందుకు కృషి చేస్తానన్నారు. సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవ తీసుకుని సీతారామ ప్రాజెక్టు నిర్మిస్తున్నారని, ప్రాజెక్ట్ పూర్తయితే నియోజకవర్గం సస్యశ్యామలమవుతుందన్నారు. తాను రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సేవ చేస్తున్నానని, ప్రజలే తనను ఎన్నికల్లో గెలిపించుకుంటారన్నారు.

## ప్రజలపై కాంగ్రెసోళ్ల ది కపట ప్రేమ



మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి హరిప్రియ

ఇల్లెందు రూరల్, నవంబర్ 26: ప్రజలపై కాంగ్రెసోళ్లది కపట ప్రేమ అని ఇల్లెందు ఎమ్మెల్యే అభ్యర్థి హరిప్రియా నాయక్ అన్నారు. ఆదివారం ఆమె పార్టీ నాయకులతో కలిసి రొంపేడు, బొజ్జాయిగూడెం, రాఘబోయినగూడెం, సీఎస్‌పీ బస్తీ, ఇందిరానగర్, బాలాజీనగర్, సుభాష్‌నగర్ ప్రాంతాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మాట్లాడారు. సంక్షేమ పథకాలకు ప్రజల్లో విశేష ఆదరణ ఉందని స్పష్టం చేశారు. లబ్ధిదారులంతా సీఎం కేసీఆర్ వెంటే ఉన్నారన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా అక్కడి ప్రజలు తనను వారి బిడ్డలా ఆదరిస్తున్నారని, ప్రేమానురాగాలు చూపిస్తున్నారని అన్నారు. ఇదంతా సీఎం కేసీఆర్ చలువేనని స్పష్టం చేశారు. ఆయన అమలుచేసిన పథకాలు ప్రజలందరికీ అందాయని, వాటి ద్వారా లబ్ధి పొందిన ప్రజలంతా ఆ అభిమానాన్ని తనపై చూపిస్తున్నారని, పథకాలు వారిని ఎంతలా ఆదుకున్నాయో వివరిస్తున్నారని అన్నారు. కానీ కాంగ్రెస్ నాయకులు అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారని, బెదిరింపు రాజకీయాలకు పాల్పడుతున్నారని అన్నారు. అలాంటి వారికి ఈ నెల 30న ప్రజలే సరైన బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు మడత వెంకట్ గౌడ్, ఉమాదేవి, శీలం రమేశ్, ఖమ్మంపాటి రేణుక, బానోత్ రమేశ్, దాస్యం ప్రమోద్, ఘాజీ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ ప్రచార రథంపై కాంగ్రెస్ నాయకుల దాడి

**పోలీసులకు ఫిర్యాదు..**
**పలువురిపై కేసు నమోదు**

అశ్వారావుపేట, నవంబర్ 26: బీఆర్ఎస్ ప్రచార రథంపై కొందరు కాంగ్రెస్ సానుభూతిపరులు దాడికి పాల్పడ్డారు. దీనిపై అశ్వారావుపేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. తెలిసిన వివరాల ప్రకారం.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు శనివారం పట్టణం నుంచి పేటమాలపల్లికి వెళుతుండగా కాంగ్రెస్ పార్టీ నేత జూపల్లి రమేష్ ప్రోద్బలంతో ఆయన అనుచరులు పుచ్చల అనిల్ కృష్ణ, పాషా ప్రచార రథం వద్దకు వచ్చి దూర్భాషలాడారు. బీఆర్ఎస్ నాయకుడు కలపాల శ్రీనివాసరావు చేతిలో మైక్‌ను లాక్కుని దాడి చేశారు. ప్రచార రథ ఫ్లెక్సీలను ధ్వంసం చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరకుని ఆందోళనకారులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బీఆర్ఎస్ నేత కలపాల శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు పోలీసులు జూపల్లి రమేశ్, అనిల్ కృష్ణ, పాషాపై కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

## మహనీయుల త్యాగం వెలకట్టలేనిది: కలెక్టర్

కొత్తగూడెం టౌన్, నవంబర్ 26 : మహనీయుల త్యాగం వెలకట్టలేనిదని, వారి త్యాగనిరతిని ప్రతిఒక్కరూ పాటించి సమాజానికి సేవలందించాలని కలెక్టర్ ప్రియాంక ఆల అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ఐడీవోసీ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి రాజ్యాంగ పీఠికకు పూలమాల వేసి నివాళి అర్పించారు.

## ఐక్యంగా ఉంటేనే ఆర్థికంగా, రాజకీయంగా ఎదుగుతాం

**రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు**

లక్ష్మీదేవిపల్లి, నవంబర్ 26 : మనమంతా ఐక్యంగా ఉంటేనే ఆర్థికంగా, రాజకీయంగా ఎదుగుతామని, మున్నూరుకాపులంతా ఐక్యంగా ఉన్నప్పుడే అభివృద్ధిని సాధించవచ్చని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, హెల్త్ డైరెక్టర్ డాక్టర్ గడల శ్రీనివాసరావు అన్నారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఆదివారం లక్ష్మీదేవిపల్లి మండలంలోని మామిడితోటలో జరిగిన కార్తీక వనసమారాధన మహోత్సవంలో ముఖ్యఅతిథులుగా పాల్గొన్న వారు మాట్లాడారు. కాపులు కార్పొరేషన్ సాధించుకునేందుకు ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు, జనసేన అభ్యర్థి లక్కినేని సురేందర్ ఎటువంటి ప్రసంగం చేయకుండానే అభివాదం చేసి వెనుదిరిగారు. మున్నూరు కాపు కులస్తులంతా సామూహికంగా భోజనాలు చేసి తోటలో సాయంత్రం వరకు ఆహ్లాదంగా గడిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య పటేల్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రంగా కిరణ్, నాయకులు పుట్టం పురుషోత్తం, ఎడవల్లి కృష్ణ, హనుమంతరావు, గోపాలకృష్ణ, ఎం.సత్యానారాయణ, వి.ప్రసాద్, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, కొత్తగూడెం, పాల్వంచ, సుజాతనగర్ మండలాలకు చెందిన కాపు కులస్తులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు

## సూక్ష్మపరిశీలకులు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలి

**జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక ఆల**

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ): పోలింగ్ విధులకు ఎంపికైన సూక్ష్మ పరిశీలకులు ఫారం 12 ద్వారా పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ప్రియాంక ఆల సూచించారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో ఆదివారం పోస్టల్ బ్యాలెట్ జారీపై ఎల్డీఎం, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారులు ఆలీం, కుసుమకుమారితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా 306 మంది సూక్ష్మ పరిశీలకులకు ఓటు వేసే వెసులుబాటు కల్పించాలన్నారు. సిబ్బంది పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అవసరమైన వారు హెల్ప్ డెస్కుల్లో సలహా తీసుకోవచ్చన్నారు. సమావేశంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామిరెడ్డి పాల్గొన్నారు.

